విజయం లేకుండానే..

ఈ ఏడాదిని ముగించిన భారత్ • మలేషియాతో పోరు 1-1తో డ్రా

హైదరాబాద్, ఆట ప్రతినిధి: భారత ఫుట్ బాల్ జట్టు ఈ ఏడాదిని కనీసం ఒక్క విజయం లేకుండానే నిరాశగా ముగించింది. ఫిఫా ఫ్రెండ్లీ మ్యాచ్‌లో భాగంగా సోమవారం స్థానిక గచ్చిబౌలి స్టేడియంలో మలేషియాతో జరిగిన పోరును టీమ్‌ఇండియా 1-1తో డ్రాగా ముగిసింది. ఆద్యంతం ఆఖరి వరకు ఆసక్తికరంగా సాగిన మ్యాచ్‌లో మలేషియా తరపున పౌలో జోశ్(19ని) గోల్ చేయగా, రాహుల్ బెకు(39ని) భారత్‌కు గోల్ అందించాడు. మ్యాచ్ నిర్ణీత సమయం(90ని)తో పాటు అదనపు సమయంలోనూ ఇరు జట్లు ఆధిపత్యం ప్రదర్శించేందుకు ప్రయత్నించాయి. సొంతగడ్డపై అభిమానుల మద్దతుతో చెలరేగేందుకు టీమ్‌ఇండియా ప్రయత్నిస్తే.. నిలువరించేందుకు మలేషియా దీటుగా పోరాడింది. మ్యాచ్ మొదలైనప్పటి నుంచే బ్లూటైగర్స్ దూకుడు కనబరిచారు. చెరో గోల్‌తో స్కోర్లు సమమయ్యాయి. అయితే మరో గోల్ కోసం రెండు జట్లు ప్రయత్నించినా లాభం లేకపోయింది.

గురుకుల పిల్లలకు ఇదేం శిక్ష?

గచ్చిబౌలికి బలవంతంగా తరలింపు

స్టేడియం నింపేందుకు ప్రభుత్వం అగచాట్లు

రాష్ట్ర ప్రభుత్వం గురుకులాలపై తమ విద్వేషాన్ని చాటుతూనే ఉన్నది. ఇప్పటికే సరైన ఆహార, వసతి సౌకర్యాలు లేక ఇబ్బందులు పడుతున్న విద్యార్థులను ఇంకా సతాయిస్తున్నది. సోమవారం భారత్, మలేషియా మధ్య జరిగిన ఫిఫా ఫ్రెండ్లీ మ్యాచ్ కోసం గురుకుల విద్యార్థులను గచ్చిబౌలి స్టేడియానికి తరలించింది. హయత్‌నగర్, ఇబ్రహీంపట్నం గురుకులాలకు చెందిన పిల్లలను ఆర్టీసీ బస్సుల్లో స్టేడియానికి తీసుకొచ్చారు. ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహించిన సాకర్ మ్యాచ్‌కు సరైన ఆదరణ లేకపోవడంతో.. స్టేడియంలోని స్టాండ్లను నింపేందుకు అధికారులు ఇలా చేసినట్లు తెలిసింది. రాత్రి 7.30కు మొదలయ్యే మ్యాచ్ కోసం మధ్యాహ్నం 3 గంటలకే తమను హాస్టళ్ల నుంచి తరలించినట్లు విద్యార్థులు చెప్పుకొచ్చారు. హాస్టల్‌లో లంచ్ ముగిసిన తర్వాత ఇక్కడికి తీసుకొచ్చారని, స్టేడియానికి వచ్చిన తర్వాత స్నాక్స్ ఇచ్చారని వారు పేర్కొన్నారు. మ్యాచ్ ముగిసిన తర్వాత బస్‌ల కోసం ఎదురుచూసిన పిల్లలు తిరిగి తమ వసతి గృహాలకు చేరుకునేందుకు చలిలో తీవ్ర ఇబ్బందులు పడాల్సి వచ్చింది. స్టేడియంలో ఖాళీ స్టాండ్లను నింపేందుకు గురుకుల పిల్లలను తీసుకురావడంపై పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ చర్యలను విమర్శిస్తున్నారు.

వీళ్లను ఆపకుంటే కష్టమే!

ప్రపంచంలో ఏ పిచ్‌పై అయినా పరుగుల వరద పారించగల సామర్థ్యం ఉన్న బ్యాటర్లు.. బంతిని అందుకుంటే పిచ్‌తో సంబంధం లేకుండా రాకెట్ వేగానికి తోడు బాల్‌ను రెండు వైపులా స్వింగ్ చేస్తూ ప్రత్యర్థి బ్యాటర్లను ముప్పు తిప్పలు పెట్టే బౌలర్లు.. మ్యాచ్‌ను మలుపు తిప్పగల ఆల్‌రౌండర్లు.. సొంతగడ్డపై అనుకూల పరిస్థితులు.. బోర్డర్ గవాస్కర్ ట్రోఫీలో గత రెండుసార్లు ఎదురైన సిరీస్ ఓటములకు బదులు తీర్చుకోవాలన్న పట్టుదల.. వెరసి భారత్‌తో సిరీస్‌కు ఆస్ట్రేలియా పూర్తిస్థాయి అస్త్రశస్త్రాలతో సిద్ధమవుతోంది.

నమస్తే తెలంగాణ క్రీడావిభాగం

స్టీవ్ స్మిత్, ఉస్మాన్ ఖవాజా, మార్నస్ లబూషేన్, మిచెల్ మార్ష్, ట్రావిస్ హెడ్, అలెక్స్ క్యారీ, మిచెల్ స్టార్క్, జోష్ హెజిల్‌వుడ్, పాట్ కమిన్స్, నాథన్ లియాన్.. క్రికెట్ అభిమానులకు ప్రత్యేకంగా పరిచయం అక్కర్లేని పేర్లివి. మరో మూడు రోజుల్లో మొదలుకాబోయే బోర్డర్ గవాస్కర్ ట్రోఫీని భారత్.. ఆస్ట్రేలియా గడ్డపై ముచ్చటగా మూడోసారి సొంతం చేసుకోవాలన్నా.. ఐసీసీ వరల్డ్ టెస్ట్ చాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) ఫైనల్‌లో మూడోసారి అడాలన్నా పైన పేర్కొన్న ఆటగాళ్ల దూకుడుకు అడ్డుకట్టవేయడం అత్యంత ఆవశ్యకం. బ్యాటర్లతో పాటు బౌలర్లలో ఏ ఒక్కరు కుదురుకున్నా మ్యాచ్‌పై ఆశలు వదిలేసుకోవాల్సిందే. గత రెండు సిరీస్‌లలో వీరి జోరుకు కళ్లెం వేసినా ప్రస్తుతం ప్రతీకారేచ్ఛతో రగిలిపోతున్న ఈ గెలుపు గుర్రాలను ఆపడం అంత సులభమేమీ కాదు.

వీరికి కళ్లెం వేయాలి

భారత్‌తో మ్యాచ్ అంటేనే చెలరేగి ఆడే బ్యాటర్లలో స్మిత్, హెడ్, లబూషేన్ అత్యంత కీలకం. వీళ్లు క్రీజులో కుదురుకుంటే ఓ పట్టాన పెవిలియన్‌కు చేరరు. సీనియర్ బ్యాటర్ స్మిత్ టీమ్‌ఇండియా అంటేనే చెలరేగిపోతాడు. మనతో ఆడిన 19 టెస్టులలో అతడు ఏకంగా 65.87 సగటుతో 2,042 పరుగులు చేశాడు. ఇందులో 9 శతకాలు, 5 అర్ధ శతకాలున్నాయి. స్వదేశంలో భారత్‌పై 16 ఇన్నింగ్స్‌లలో ఏకంగా 83.23 సగటుతో 1,082 పరుగులు చేశాడంటేనే అతడి జోరును అర్థం చేసుకోవచ్చు. ఓపెనర్ ఖవాజాకు భారత్‌పై ఘనమైన రికార్డేమీ లేకపోయినా ఈ డబ్ల్యూటీసీ సైకిల్‌లో అతడు జోరుమీదున్నాడు. గత 12 టెస్టులలో అతడు 943 పరుగులు (41 సగటు) సూపర్ ఫామ్‌లో ఉన్నాడు. డేవిడ్ వార్నర్ రిటైర్ అయిన తర్వాత అతడు సరైన ఓపెనింగ్ భాగస్వామి లేక ఇబ్బందిపడుతున్నా గతేడాది భారత పర్యటనలో బౌలర్లను సమర్థవంతంగా ఎదుర్కున్న అనుభవం అతడికుంది. టెస్ట్ స్పెషలిస్టు లబూషేన్ గత పర్యటనలో టాప్ స్కోరర్ (426 పరుగులు). భారత్‌పై ఆడిన 10 మ్యాచ్‌లలో అతడు 45.58 సగటుతో 775 రన్స్ చేశాడు. అతడూ ప్రమాదకారే. ఇక రోహిత్ సేనకు రెండు ఐసీసీ ట్రోఫీలను దూరం చేయడంలో కీలక పాత్ర పోషించిన ట్రావిస్ హెడ్ మిడిలార్డర్‌లో అత్యంత కీలకం. వన్డే వరల్డ్‌కప్, డబ్ల్యూటీసీ ఫైనల్- 2023లో అతడు భారత బౌలర్లకు కొరకరాని కొయ్యగా మారాడు. వికెట్ కీపర్ బ్యాటర్ క్యారీ సైతం అదే కోవకు చెందుతాడు. గత 20 ఇన్నింగ్స్‌లలో అతడు 536 పరుగులు చేసి ఆసీస్ విజయాల్లో కీలకంగా మారుతున్నాడు. తుది జట్టులో చోటు దక్కించుకుంటే మిచెల్ మార్ష్ మ్యాచ్ గమనాన్నే మార్చేయగల సమర్థుడు. రికార్డులపరంగా వీళ్లంతా దుర్బేధ్యంగా కనిపిస్తున్నప్పటికీ గత కొంతకాలంగా వీరిలో ఖవాజా, మార్ష్ మాత్రమే టెస్టులలో 40 సగటు కలిగిఉన్నారు. 2023-25 సైకిల్‌లో 12 మ్యాచ్‌లు ఆడిన స్మిత్.. 35 సగటుతో 738 పరుగులు చేయగా.. లబూషేన్ 12 టెస్టులలో 29.68 సగటుతో 653 రన్స్ మాత్రమే సాధించాడు. గత డబ్ల్యూటీసీ ఫైనల్ తర్వాత ఆడిన 12 టెస్టులలో హెడ్ సగటు 29.68 మాత్రమే.

వారిని అడ్డుకోవాలి!

బంతి పిచ్‌ను తాకడమే ఆలస్యం రాకెట్ వేగంతో దూసుకొచ్చే ఆసీస్ పిచ్‌లపై పేస్ త్రయం స్టార్క్, హెజిల్‌వుడ్, కమిన్స్‌ను కట్టడి చేయడం భారత బ్యాటర్లకు కత్తిమీద సవాలే. ఈసారి పక్కా ప్రణాళికతో దిగుతున్న ఈ త్రయానికి తోడు స్పిన్నర్ నాథన్ లియన్ కూడా టీమ్‌ఇండియాను ముప్పుతిప్పలు పెట్టేందుకు సిద్ధమయ్యారు. గత పర్యటనలో ప్రస్తుత ఆసీస్ సారథి కమిన్స్.. 4 టెస్టులలోనే 21 వికెట్లతో చెలరేగితే హెజిల్‌వుడ్.. 17 వికెట్లు తీశాడు. భారత్‌తో ఆడిన 18 టెస్టులలో స్టార్క్ 48 వికెట్లు పడగొట్టగా కమిన్స్ 13 టెస్టులలోనే 50 వికెట్లు తీశాడు. హెజిల్‌వుడ్ సైతం 15 టెస్టులలోనే 51 వికెట్లు తీశాడు. ఇక స్పిన్నర్ నాథన్ లియన్ అయితే 27 టెస్టులలో 121 వికెట్లు దక్కించుకున్నాడు. ఈసారి ప్రతీకారేచ్ఛతో రగిలిపోతున్న కంగారూలు.. ప్రత్యేకంగా పేస్ పిచ్‌లనే రూపొందించుకుంటున్న తరుణంలో వీరిని భారత బ్యాటర్లు ఏ మేరకు నిలువరిస్తారనేది కీలకం. పిచ్‌మీద పచ్చిక ఉంటే భారత బ్యాటర్లకు కాలరాత్రులు తప్పకపోవచ్చు.

కివీస్ క్రికెటర్‌పై నెల రోజుల నిషేధం

వెల్లింగ్టన్: న్యూజిలాండ్ బౌలింగ్ ఆల్‌రౌండర్ డగ్ బ్రాస్‌వెల్‌పై ఆ దేశ స్పోర్ట్స్ ఇంటిగ్రిటీ కమిషన్ నెల రోజుల నిషేధాన్ని విధించిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ ఏడాది ఆరంభంలో దేశవాళీ టీ20 మ్యాచ్ ఆడుతూ కొకైన్ వాడినట్టు వైద్య పరీక్షలో తేలింది. వాస్తవానికి స్పోర్ట్స్ కమిషన్ బ్రాస్‌వెల్‌పై 3 నెలల నిషేధం విధించగా అతడు తన చర్యకు పశ్చాత్తాప్పడుతూ వైద్యం చేయించుకోవడంతో నిషేధాన్ని నెల రోజులకు తగ్గించింది. నిషేధ సమయం ఇప్పటికే పూర్తయిన నేపథ్యంలో అతడు మళ్లీ అంతర్జాతీయ స్థాయిలో ఆడేందుకు సిద్ధమవుతున్నాడు.

ఇంగ్లండ్‌దే సిరీస్

సెయింట్‌లుసియా: వెస్టిండీస్ పర్యటనలో ఇంగ్లండ్ అదరగొట్టింది. ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌ను ఆ జట్టు 3-1తో గెలుచుకుంది. తొలి మూడు మ్యాచ్‌లలో పర్యాటక జట్టు ఆల్‌రౌండ్ ప్రదర్శనతో జయకేతనం ఎగురవేయగా నాలుగో టీ20లో వెస్టిండీస్ నెగ్గింది. ఆదివారం జరిగిన చివరి టీ20 వర్షం కారణంగా అర్ధాంతరంగా రద్దయింది. అంతకుముందు విండీస్.. మూడు వన్డేల సిరీస్‌ను 2-1తో దక్కించుకుంది. ఇంగ్లండ్ బౌలర్ సకీబ్‌కు 'మ్యాన్ ఆఫ్ ద సిరీస్'గా నిలిచాడు.

క్వార్టర్స్‌లో చార్జర్స్

హైదరాబాద్, ఆట ప్రతినిధి: తెలంగాణ ప్రీమియర్ గోల్ఫ్ లీగ్(టీపీజీఎల్) సీజన్-4లో క్వార్టర్స్ బెర్తులు ఖరారయ్యాయి. సోమవారంతో ముగిసిన లీగ్ దశ పోటీల్లో మెరుగైన ప్రదర్శన ఆధారంగా ఎనిమిది జట్లు క్వార్టర్స్‌కు అర్హత సాధించాయి. ఇందులో ఆటమ్ చార్జర్స్, టీమ్ దాసోస్, ఎమ్‌వైకే స్ట్రైకర్స్, టీమ్ ఎమ్‌వైఎస్ఏ, గోల్డెన్ ఈగల్స్, రిట్జ్ మాస్టర్స్, వ్యాలీ వారియర్స్, టీమ్ టీఆఫ్ ఫేయిర్‌మౌంట్ ఉన్నాయి. రెండో రౌండ్ నుంచి తమదైన దూకుడు కనబరుస్తున్న ఆటమ్ చార్జర్స్ 959 పాయింట్లతో అగ్రస్థానం కైవసం చేసుకుంది. ఈనెల 24 నుంచి క్వార్టర్స్ మ్యాచ్‌లు మొదలుకానున్నాయి.

ఆసీస్ క్లీన్‌స్వీప్

3-0తో పాక్‌పై సిరీస్ కైవసం

హోబర్ట్: సొంతగడ్డపై పాకిస్థాన్ చేతిలో వన్డే సిరీస్ కోల్పోయిన ఆస్ట్రేలియా టీ20లలో మాత్రం దుమ్మురేపింది. మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా సోమవారం జరిగిన మూడో టీ20లో ఆసీస్ 7 వికెట్ల తేడాతో గెలిచి 3-0తో క్లీన్‌స్వీప్ చేసింది. టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ చేసిన పాక్.. 18.1 ఓవర్లలో 117 పరుగులకే ఆలౌట్ అయింది. బాబర్ ఆజమ్ (41) టాప్ స్కోరర్ కాగా మిగిలిన బ్యాటర్లంతా విఫలమయ్యారు. ఛేదనను ఆసీస్.. 11.2 ఓవర్లలోనే పూర్తి చేసింది. మార్కస్ స్టోయినిస్ (27 బంతుల్లో 61 నాటౌట్, 5 ఫోర్లు, 5 సిక్సర్లు) ధాటిగా ఆడాడు. స్టోయినిస్‌కు 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్', జాన్సన్‌కు 'మ్యాన్ ఆఫ్ ద సిరీస్' దక్కాయి.

సిన్నర్‌దే ఏటీపీ టైటిల్

టురిన్ (ఇటలీ): టెన్నిస్ యువ సంచలనం జన్నిక్ సిన్నర్ మరో ప్రతిష్టాత్మక టైటిల్‌ను తన ఖాతాలో వేసుకున్నాడు. టురిన్‌లో ఆదివారం జరిగిన ఏటీపీ పురుషుల సింగిల్స్ ఫైనల్‌లో సిన్నర్ 6-4, 6-4తో టేలర్ ఫ్రిట్జ్ (యూఎస్ఏ)ను ఓడించి టైటిల్‌ను సొంతం చేసుకున్నాడు. ఈ ఏడాది అంతర్జాతీయ టెన్నిస్‌లో సిన్నర్ అంచనాలకు మించి రాణిస్తున్నాడు. అతడు రెండు గ్రాండ్‌స్లామ్ టైటిల్స్ (ఆస్ట్రేలియా ఓపెన్, యూఎస్ ఓపెన్)తో పాటు ఆరు ఏటీపీ టూర్ టైటిల్స్ గెలవడం విశేషం. ఇటలీ తరపున గ్రాండ్‌స్లామ్ టైటిల్స్ నెగ్గిన తొలి టెన్నిస్ ప్లేయర్‌గా సిన్నర్ సరికొత్త చరిత్ర సృష్టించిన విషయం విదితమే. 2024లో 76 మ్యాచ్‌లు ఆడిన ఈ కుర్రాడు.. ఏకంగా 70 మ్యాచ్‌లలో గెలవడమే గాక ఈ ఏడాది ప్రపంచ నంబర్‌వన్ ర్యాంకుతో సీజన్‌ను ముగించాడు.

బుజ్జి తల్లి వస్తున్నది..

నాగచైతన్య, సాయిపల్లవి జంటగా నటిస్తున్న లవ్ అండ్ యాక్షన్ డ్రామా 'తండేల్'. శ్రీకాకుళం జిల్లాలోని డి.మచ్చిలేశం గ్రామంలో జరిగిన యథార్థ సంఘటనల సమాహారం ఈ సినిమా. చందూ మొండేటి దర్శకత్వంలో బన్నీ వాసు నిర్మిస్తున్నారు. షూటింగ్ చివరి దశలో ఉంది. మేకర్స్ ప్రమోషన్స్‌ని వేగవంతం చేశారు. అందులో భాగంగా ఈ సినిమా మ్యూజిక్ జర్నీని ప్రారంభించారు. ఈ నెల 21 ఈ సినిమాలోని ఫస్ట్ సింగిల్ 'బుజ్జి తల్లి..' సాంగ్‌ని విడుదల చేయనున్నట్టు మేకర్స్ ప్రకటించారు. ఈ సందర్భంగా ఓ పోస్టర్‌ని కూడా విడుదల చేశారు. లీడ్ పెయిర్ నాగచైతన్య, సాయిపల్లవి పాత్రల అనుబంధాన్ని ఆవిష్కృతం చేసేలా ఈ పోస్టర్ ఉన్నది. సంగీతానికి మంచి స్కోప్ ఉన్న కథతో ఈ సినిమా రూపొందుతున్నదని, దేవిశ్రీ ప్రసాద్ అద్భుతమైన సంగీతాన్ని అందించారని, ఇద్దరు ప్రేమికుల భావోద్వేగమే ఈ పాట అని మేకర్స్ తెలిపారు. ఈ చిత్రానికి కెమెరా: షామ్ దత్, సమర్పణ: అల్లు అరవింద్, నిర్మాణం: గీతాఆర్ట్స్.

చిత్రం

రహస్యాల సత్యభామ

''నేను హైదరాబాద్‌లోనే పుట్టాను. ఇక్కడే ఇంజనీరింగ్ చేశాను. కార్పొరేట్ జాబ్ కూడా చేశాను. తర్వాత మిస్ ఇండియా టైటిల్ గెలిచాను. మిస్ వరల్డ్ పోటీల్లో ఇండియాను రిప్రజెంట్ చేశాను. ఆ తర్వాత మూవీ వర్క్ షాప్‌కి వెళ్లాను. అక్కడే యాక్టింగ్‌పై ఇష్టం మొదలైంది. కాన్ఫిడెంట్ పెరిగింది. కొన్ని ఆడిషన్స్ కూడా ఇచ్చాను. అలా 'దేవకీనందన వాసుదేవ'లో హీరోయిన్‌గా ఎంపికయ్యాను. నా తెలుగు ఎంట్రీ ఇలాంటి మంచి సినిమాతో కావడం చాలా ఆనందంగా ఉంది' అని మానస వారణాసి అన్నారు. మహేశ్‌బాబు మేనల్లుడు గల్లా అశోక్ సరసన ఆమె నటించిన చిత్రం 'దేవకీ నందన వాసుదేవ'. దర్శకుడు ప్రశాంత్‌వర్మ కథతో, అర్జున్ జంధ్యాల దర్శకత్వంలో సోమినేని బాలకృష్ణ నిర్మించారు. ఈ నెల 22న విడుదల కానుంది. మానస వారణాసి సోమవారం హైదరాబాద్‌లో విలేకరులతో ముచ్చటించారు. 'ఇదొక కమర్షియల్ డివైన్ థ్రిల్లర్. తొలి సినిమాకే ఇలాంటి కథ, క్యారెక్టర్ దొరకడం నిజంగా అదృష్టం. ఇందులో నా పాత్ర పేరు సత్యభామ. విజయనగరం అమ్మాయిని. లవబుల్, మిస్టీరియస్ గర్ల్. కథలో నాది చాలా బలమైన పాత్ర. ఛాలెంజ్‌గా తీసుకొని ఈ పాత్ర చేశాను. అశోక్ చాలా ప్రొఫెషనల్. అతనికి సినిమా అంటే పాషన్. సెట్స్‌లో ప్రతి విషయాన్నీ షేర్ చేసుకునేవారు' అని తెలిపింది. భీమ్స్ సంగీతం సినిమాకు హైలైట్‌గా నిలుస్తుందని, బాలకృష్ణ సోమినేని చాలా పాషనేట్ ప్రొడ్యూసర్ అని మానస వారణాసి చెప్పారు.

తెలంగాణ సోయి ఉన్నోళ్లు చూడాల్సిన సినిమా

'కేసీఆర్' ప్రీరిలీజ్ వేడుకలో మాజీ మంత్రి హరీశ్ రావు

'కేసీఆర్ అంటే ఓ చరిత్ర. తెలంగాణ రాష్ట్రాన్ని సాధించడమే కాకుండా పదేళ్ల పాటు అభివృద్ధి పథంలో నడిపించారు. కేసీఆర్‌గారు పల్లెలతో పాటు హైదరాబాద్‌ను అద్భుతంగా అభివృద్ధి చేశారు. కేవలం భౌతికపరమైన అభివృద్ధే కాకుండా సామాజికంగా, సాంస్కృతికంగా రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అగ్రపథంలో నిలిపారు. ఈరోజు తెలంగాణ దేశానికి దిక్సూచిలా నిలబడిందంటే అందుకు కేసీఆర్‌గారు చేసిన కృషియే కారణం' అన్నారు మాజీ మంత్రి హరీశ్ రావు. జబర్దస్త్ నటుడు రాకింగ్ రాకేష్ స్వీయ నిర్మాణంలో హీరోగా నటించిన చిత్రం 'కేశవ చంద్ర రమావత్' (కేసీఆర్). గరుడవేగ అంజి దర్శకత్వం వహించారు. ఈ నెల 22న ప్రేక్షకుల ముందుకు రానుంది. సోమవారం హైదరాబాద్‌లో ప్రీరిలీజ్ ఈవెంట్‌ను నిర్వహించారు. ఈ వేడుకకు హరీశ్ రావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'ఈ సినిమా ద్వారా కేసీఆర్‌గారు తెలంగాణ కోసం చేసిన పోరాటాన్ని ప్రజలకు చూపించే గొప్ప ప్రయత్నాన్ని చేశారు రాకేష్. సాధారణంగా ఎవరైనా పవర్‌లో ఉన్న పార్టీ మీద సినిమా తీస్తారు. కానీ అధికారంలో లేని పార్టీ మీద సినిమా తీశాడంటే అది అతనికి తెలంగాణపై ఉన్న ప్రేమ, దమ్ము.. ధైర్యం అనుకోవచ్చు. ముఖ్యమంత్రులు వస్తుంటారు.. పోతుంటారు. కానీ తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన ఒకే ఒక్కరు కేసీఆర్. తద్వారా ఆయన ఓ చరిత్ర సృష్టించారు. అటువంటి కేసీఆర్‌గారి మీద సినిమా తీయడం అభినందనీయం. తెలంగాణ మీద సోయి వున్న వాళ్లు, తెలంగాణ ప్రేమికులు, కేసీఆర్ అభిమానులందరూ ఈ సినిమా చూడాలని కోరుకుంటున్నా' అన్నారు. చిత్ర టీజర్‌ను ఆవిష్కరించిన ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ మాట్లాడుతూ 'తెలంగాణలో ఎక్స్‌ప్లోర్ చేయాల్సిన కథలెన్నో ఉన్నాయి. ఇక్కడ అనేక వర్ణాలు, ఉద్వేగాలతో కూడిన గొప్ప జీవనం కనిపిస్తుంది. ఈ నేపథ్యంలో తెలంగాణ ఆత్మను ప్రతిఫలించే సినిమాలు ఇంకా రావాల్సి ఉంది. ప్రస్తుతం గిరిజనుల మీద అణచివేత గురించిన చర్చ జరుగుతున్నది. ఈ సందర్భంలో రాకేష్ గిరిజనుల మీద సినిమా తీశాడు. ఇందులో తెలంగాణ లంబాడి యువకున్ని హీరో చేసినందుకు రాకేష్‌ను అభినందిస్తున్నా. ఇలాంటి మరిన్ని కథలతో తెలంగాణ సినిమాకు స్వర్ణ యుగం రావాలని కోరుకుంటున్నా' అన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ గోరటి వెంకన్న, మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్, దర్శకుడు ఎన్.శంకర్, వైకాపా నేత, సినీ నటి రోజా తదితరులు పాల్గొన్నారు.

మరింత రాజుకున్న నయన్-ధనుష్ వివాదం

డాక్యుమెంటరీలో 'నానుమ్ రౌడీదాన్' కంటెంట్ తొలగించాలని నయనతారకు నోటీసులు

తమిళ అగ్ర నటులు ధనుష్, నయనతార మధ్య వివాదం మరింత రాజుకుంది. ఈ నెల 16న ఇన్‌స్టాగ్రామ్ వేదికగా షేర్ చేసిన లేఖలో ధనుష్ వ్యవహార శైలిపై, వ్యక్తిత్వంపై నయనతార తీవ్ర ఆరోపణలు చేసిన విషయం తెలిసిందే. ధనుష్ తనపై ఈర్ష్యను పెంచుకున్నాడని, అతనిది అల్పబుద్ధి అని, దిగజారుడు వ్యక్తిత్వం అంటూ పరుష పదజాలంతో విరుచుకుపడింది నయనతార. ఈ వివాదం మొత్తానికి ఆమె జీవిత విశేషాలతో నెట్‌ఫ్లిక్స్ రూపొందించిన 'నయనతార బియాండ్ ది ఫెయిరీ టేల్' డాక్యుమెంటరీ కేంద్రమైంది. సోమవారం నుంచి ఈ డాక్యుమెంటరీ నెట్‌ఫ్లిక్స్‌లో స్ట్రీమింగ్ అవుతున్నది. ఈ నేపథ్యంలో వీరిద్దరి మధ్య వివాదం ఇప్పట్లో సమసిపోయేలా కనిపించడం లేదు. నయనతార డాక్యుమెంటరీలో 'నానుమ్ రౌడీదాన్' (తెలుగులో 'నేనూ రౌడీనే') సినిమాకు సంబంధించిన మూడు సెకన్ల నిడివిగల క్లిప్‌ను ఉపయోగించడంపై ధనుష్ అభ్యంతరం చెప్పారు. ఈ సినిమాకు నిర్మాత ఆయనే కావడంతో కాపీరైట్ యాక్ట్‌కింద 10కోట్ల నష్టపరిహారం చెల్లించాలంటూ నయనతార టీమ్‌కు నోటీసులు పంపించాడు. దాదాపు రెండేళ్ల నుంచి సినిమా క్లిప్‌ను ఉపయోగించుకునే విషయంలో ధనుష్‌తో జరిపిన చర్చలు విఫలం కావడం, పది కోట్ల నష్టపరిహారం చెల్లించాలంటూ నోటీసులు పంపడంతో నయనతారలో ఆగ్రహం కట్టలు తెంచుకుంది. ఈ నేపథ్యంలో నయనతార ఇన్‌స్టాగ్రామ్ వేదికగా సుదీర్ఘమైన లేఖను రాసింది. తాజాగా ఈ వివాదం మరోమలుపు తిరిగింది. నయనతార డాక్యుమెంటరీలో ఉపయోగించిన 'నానుమ్ రౌడీదాన్' సినిమా కంటెంట్‌ను 24 గంటల్లో తొలగించకపోతే లీగల్ యాక్షన్ తీసుకుంటామని ధనుష్‌కు చెందిన లాయర్ నయనతారకు నోటీసులు పంపారు. అయితే ఈ విషయంలో నయనతార వాదన మరోలా ఉంది. డాక్యుమెంటరీలో 'నానుమ్ రౌడీదాన్' సినిమా తాలూకు ఒరిజినల్ క్లిప్‌లను తీసుకోలేదని, షూటింగ్ సందర్భంగా పర్సనల్‌గా తీసుకున్న బిహైండ్ సీన్స్ ఫుటేజీని వాడుకున్నామని నయనతార చెబుతున్నది. దీనిపై ధనుష్ తరపున లాయర్ తన నోటీస్‌లో స్పందించారు. సినిమాకు సంబంధించిన కంటెంట్‌పై నిర్మాతకు సర్వ హక్కులు ఉంటాయని, పర్సనల్ ఫోన్లలో షూట్ చేసిన వీడియోలను కూడా ఉపయోగించే వీలు లేదని ఆయన నోటీసుల్లో పేర్కొన్నారు.

ఇద్దరి మధ్య వివాదం ఏమిటి?

నయనతార రాసిన లేఖ తమిళ చిత్రసీమలో హాట్‌టాపిక్‌గా మారింది. అసలు వీరిమధ్య వివాదానికి ఎక్కడ బీజం పడిందంటూ చర్చలు మొదలయ్యాయి. ఈ వివాదం పూర్వాపరాల్లోకి వెళితే...'నానుమ్ రౌడీదాన్' (2015) షూటింగ్ సమయంలోనే దర్శకుడు విఘ్నేష్‌శివన్‌తో చిత్ర కథానాయిక నయనతార ప్రేమలో పడింది. ఏడేళ్ల ప్రేమాయణం అనంతరం వారిద్దరు వివాహం చేసుకున్నారు. ఈ సినిమా చిత్రీకరణ సమయంలో దర్శకుడు విఘ్నేష్, నిర్మాత ధనుష్ మధ్య విభేదాలు తలెత్తాయి. బడ్జెట్ మించిపోతున్నదంటూ విఘ్నేష్‌పై అసంతృప్తిగా ఉండేవారు ధనుష్. సినిమా డిజాస్టర్ అవుతుందని తన సన్నిహితులతో చెప్పేవారు. అయితే ఆయన అంచనాలను తలక్రిందులు చేస్తూ 'నానుమ్ రౌడీదాన్' పెద్ద హిట్‌గా నిలవడమే కాకుండా విఘ్నేష్‌కు మంచి పేరు తీసుకొచ్చింది. ఈ పరిణామాలతో ధనుష్ ఇగో హర్ట్ అయిందని చెబుతారు. ఇదే విషయాన్ని నయనతార తన లేఖలో పరోక్షంగా ప్రస్తావించింది. 'సినిమా సక్సెస్‌కావడంతో ధనుష్ అంచనాలన్నీ తప్పాయి. విఘ్నేష్‌ను నిందించే అవకాశం లేకపోవడంతో ఆయన ఇగో హర్ట్ అయింది. అందుకే 2016 ఫిల్మ్‌ఫేర్ ప్రదానోత్సవంలో కూడా తన అక్కసును వెళ్లగక్కాడు' అంటూ నయనతార లేఖలో రాసుకొచ్చింది. తాజా పరిణామాల నేపథ్యంలో ఈ వివాదం మరెన్ని మలుపులు తిరుగుతుందోనని తమిళ సినీ వర్గాల్లో ఆసక్తి నెలకొంది.

అన్ని ఎమోషన్స్ ఉన్న ఆర్గానిక్ కథ 'జీబ్రా'

'' 'జీబ్రా' ఓ కొత్త ప్రపంచం. కమర్షియల్ ఎలిమెంట్స్‌కి రియలిస్టిక్ ఎలిమెంట్స్ బ్లెండ్ చేయడం కొన్ని కథలకే కుదురుతుంది. అది 'జీబ్రా'కు కుదిరింది. అన్ని ఎమోషన్స్ ఉన్న ఆర్గానిక్ కథ 'జీబ్రా'. సినిమా అద్భుతంగా వచ్చింది.'' అని దర్శకుడు ఈశ్వర్ కార్తీక్ అన్నారు. ఆయన దర్శకత్వంలో సత్యదేవ్ నటించిన యాక్షన్ ఎంటర్టైనర్ 'జీబ్రా'. ఎస్.ఎన్.రెడ్డి, ఎస్.పద్మజ, బాలసుందరం, దినేష్ సుందరం నిర్మాతలు. నవంబర్ 22న సినిమా విడుదల కానుంది. ఈ సందర్భంగా డైరెక్టర్ ఈశ్వర్ కార్తీక్ సోమవారం విలేకరులతో మాట్లాడారు. 'బ్యాంకింగ్ వరల్డ్‌లో గుప్తంగా జరిగే తప్పుల్ని ప్రపంచానికి తెలియజేయాలనే సంకల్పంతో రాసుకున్న కథ ఇది. బ్యాంకింగ్, మనీ లాండరింగ్, గ్యాంగ్‌స్టర్ ఇలా మూడు ప్రపంచాలను కలిపి ఈ కథ రాశాను. స్క్రీన్‌ప్లే ఈ సినిమాకు ప్రాణం. బ్లాక్ అండ్ వైట్‌ని సూచించే యానిమల్ జీబ్రా. అందుకే ఈ సినిమాకు ఆ టైటిల్ పెట్టాను. ఈ కథలో నా వ్యక్తిగత అనుభవాలు, పాత్రలు కూడా ఉంటాయి' అని చెప్పారు ఈశ్వర్ కార్తీక్. ఇందులోని ప్రతి పాత్ర కీలకంగానే ఉంటుందని, రవి బస్రూర్ అద్భుతమైన సంగీతం అందించారని, మూడు ప్రపంచాలకూ డిఫరెంట్ లేయర్ మ్యూజిక్ ఇచ్చారని, నిర్మాతల